ప్రజాశక్తి

సోమవారం 6 ఫిబ్రవరి 2023

5

అల్లూరి సీతారామరాజు



ఎన్ఎంఎంఎస్ పరీక్షలు ప్రశాంతం



పరిశీలిస్తున్న డిఇఒ, చీఫ్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో తలారిసింగి జిటిడబ్ల్యు ఆశ్రమ బాలుర పాఠశాలలో జాతీయ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో చదువుతున్న 244 మంది విద్యార్థులకు గాను 186 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. డిపార్ట్ మెంట్ అధికారిగా పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.కృష్ణమూర్తి, చీఫ్ సూపరింటెండెంట్‌గా తలారిసింగి జిటిడబ్ల్యు ఆశ్రమ బాలుర పాఠశాల హెచ్ఎం రీమలి జాన్ వ్యవహరించారు. పరీక్షా కేంద్రాన్ని డిఇఒ పి.రమేష్ పర్యవేక్షించారు.

సిపిఎస్ రద్దు చేయాలని..

యుటిఎఫ్ ఆధ్వర్యాన సంకల్ప దీక్ష

-ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- జిపిఎస్‌ను అంగీకరించం

- స్పష్టం చేసిన నేతలు



పాడేరులో దీక్ష చేపడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలోని పాడేరు గిరిజన సంఘం భవన ప్రాంగణంలో ఆదివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో సంకల్ప దీక్ష నిర్వహించారు. ఈనెల 3న గన్నవరం లోని ధర్నాచౌక్ లో ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించ తలపెట్టిన "సంకల్ప దీక్ష"ను ప్రభుత్వం, పోలీసులతో బలవంతంగా భగ్నం చేసినందుకు నిరసనగా యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చింది. ఈ మేరకు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు లో యుటిఎఫ్ జిల్లా నాయకులు సిహెచ్.నాగేశ్వరరావు అధ్యక్షతన యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.మహేష్, అల్లూరి జిల్లా సిపిఎస్ కన్వీనర్ ఎల్.నారాయణరావు ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ సంకల్ప దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న జిపిఎస్ వద్దని, ఓపిఎస్ మాత్రమే సమస్యకు పరిష్కారమని స్పష్టం చేశారు. ఎటువంటి హామీ ఇవ్వని రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాలు సిపిఎస్ ను రద్దు చేశాయని, ఇదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో యుటిఎఫ్ అల్లూరి జిల్లా గౌరవ అధ్యక్షులు టి.చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు సిహెచ్.నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రఘునాథ్, అనంతగిరి మండల అధ్యక్షుడు దేముడు పాల్గొన్నారు.

చింతూరు: సిపిఎస్ రద్దు కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన చేపట్టిన సంకల్పదీక్షలో పాల్గొనేందుకు విజయవాడ వెళ్లిన ఉపాధ్యాయుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ యూనియన్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు డివిజన్ కేంద్రమైన చింతూరులో ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షురాలు ఎం.కవిత అధ్యక్షత వహించిన దీక్ష శిబిరాన్ని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు ఎస్.నాగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల ముందు పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తానని ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేయడం సాధ్యం కాదని ప్రభుత్వం చెప్పడం సబబు కాదన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి తండా కృష్ణయ్య, వెంకటనారాయణ మాట్లాడుతూ, సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. సిపిఎస్ రద్దయ్యే వరకు యుటిఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. దీక్షలకు వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం, సిఐటియు ప్రజా సంఘాల బాధ్యులు కె.సీతారామయ్య, సురేష్, లక్ష్మణ్ సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల యుటిఎఫ్ నాయకులు ఎస్.జగదీష్, ఎస్ రామకృష్ణ, ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు, సీత, అబ్బులు దొర, ఏ.సుజాత, బి.ముత్యయ్య, కె.శ్రీనివాస్ దొర, కె.మోహన్‌రావు, కె.భాస్కర్, అప్పారావు, ఎస్ బాబూరావు, తులసి, రత్నకుమారి, ఎన్.ప్రసాద్ టి రాము, ప్రసాద్ శ్రీనివాస్, సుబ్బమ్మ పాల్గొన్నారు.



చింతూరులో దీక్షలో కూర్చున్న యుటిఎఫ్ నేతలు


విద్యుత్ చౌర్యంపై నిరంతర నిఘా

- పౌర సేవల జాప్యంపైనా విచారణ
- 1912ను సద్వినియోగం చేసుకోవాలి
- ఇపిడిసిఎల్ ఛీఫ్ విజిలెన్స్ అధికారి ఎఎస్‌పి ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి: 'విద్యుత్ వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులొచ్చినా, పౌర సేవలు సకాలంలో అందకపోయినా, సేవలకు డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిసినా ఫిర్యాదులపై విచారణ చేపడతాం. విద్యుత్ చౌర్యం నియంత్రణకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం. డిస్కాంలో సివిల్ వర్కులు, మెటీరియల్‌లో నాణ్యత వంటివి లోపించినా పరిశీలిస్తాం. చర్యలకు సిఫార్సు చేస్తాం' - అని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపిఇపిడిసిఎల్) ఛీఫ్ విజిలెన్స్ అధికారి, అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఎవిఎల్.ప్రసన్నకుమార్ అన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ విభాగపు సేవలను వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

విద్యుత్ చౌర్యం నియంత్రణకు తీసుకున్న చర్యలేంటి ?

ఇపిడిసిఎల్ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడకుండా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఫిర్యాదులొచ్చినా, సమాచారమిచ్చినా, మీడియాలో వార్తలొచ్చినా వాటిపై స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి కేసులు నమోదు చేస్తున్నాం. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారెంతటివారైనా, ఏ కేటగిరీ వినియోగదారుడైనా ఉపేక్షించేదిలేదు. చర్యలు తీసుకుంటాం.





సమస్యలను తెలియజేయాలంటే ఎలా ?

విద్యుత్ వినియోగదారులు సరఫరాలో జరిగిన లోపాలు, సేవల్లో జాప్యం, సేవలకు డబ్బులు డిమాండ్ చేసిన ఉద్యోగుల సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబరు 1912కు తెలియజేయొచ్చు. ఈ నెంబరుకు వచ్చిన ఫోన్‌కాల్స్ రికార్డు అవుతాయి. కార్యాలయ ఫోన్ నెంబరు 0891-2705477కు సమాచారమివ్వొచ్చు. లేదంటే CVO @apeasternpower.comకు ఈ - మెయిల్ ద్వారా తెలియజేసే అవకాశముంది. వినియోగదారులు వీటిలో దేని ద్వారా సమాచారమిచ్చినా విచారణ చేపడతాం.

గతేడాది ఎన్ని కేసులు నమోదుచేశారు ?

గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు విద్యుత్ చౌర్యానికి సంబంధించి 6,454 కేసులు నమోదుచేశాం. ఈ తరహా కేసులను 6,760 పరిష్కరించి రూ.68.83 లక్షలు అపరాధ రుసుము వసూలు చేశాం. 2021లో 5,802 కేసులు పరిష్కరించి రూ.66.41 లక్షలు, 2020లో 5,456 కేసులు పరిష్కరించి రూ.58.68 లక్షలు అపరాధ రుసుము వసూలు చేశాం. విద్యుత్‌శాఖ ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి చర్యలకు ఇపిడిసిఎల్ సిఎమ్‌డికి సిఫార్సు చేస్తాం.

నిఘా వ్యవస్థ పనితీరు ఎలా ఉంది ?

నిఘా వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోంది. విద్యుత్ చౌర్యం, ఉద్యోగులపై ఆరోపణలు, సివిల్ వర్క్సు, మెటీరియల్‌లో నాణ్యతా లోపాలపై దృష్టిపెట్టి తనిఖీలు పెంచుతున్నాం. ఎపి ట్రాన్స్‌కో విజిలెన్స్ జెఎమ్‌డి మల్లారెడ్డి సూచనలు తీసుకుంటూ, విజిలెన్స్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ డిస్కాం సేవలు ప్రజలు వినియోగించుకొనేలా ప్రయత్నిస్తున్నాం. శాఖాపరమైన ప్రమాదాలపై కూడా విచారణ నిర్వహించి నివేదిక అందజేస్తాం.

మౌలిక సౌకర్యాలు కల్పించరూ..

గిరిజన సంఘం మండల కార్యదర్శి విద్యాసాగర్ రెడ్డి



అసంపూర్తి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గిరిజన సంఘం నేత విద్యాసాగర్ రెడ్డి

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని వెట్టిచెలకలు గ్రామంలో తిష్టవేసిన సమస్యలను పరిష్కరించి, కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు సాదల విద్యాసాగర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామాన్ని సందర్శించి, ఇంటింటా సమస్యలపై సర్వే చేశారు. జలజీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసినా చుక్కనీరు రావడం లేదని, సిసిడిపి ద్వారా నిర్మించిన పశువుల షెడ్‌లు పునాదుల్లోనే నిలిచిపోయాయని, మార్జిన్ మనీ కట్టించుకుని, సబ్సిడీ ఇస్తామని అధికారులు పత్తా లేకుండా పోయారని విమర్శించారు. రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు, శంకుస్థాపనలే తప్ప పనులు జరగడం లేదన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు ఐటిడిఎ, ఇతర శాఖల అధికారులు వెట్టిచెలకలు గ్రామ సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తక్షణమే రోడ్లు, తాగునీరు, ఇతర సౌకార్యలు కల్పించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు...వణికిస్తున్న చలి

ఇబ్బందులు పడుతున్న మన్యప్రాంత గిరిజనం

శీతాకాలం మాదిరి చలి మంటలతో ఉపశమనం



చలిమంటలతో ఉపశమనం పొందుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - సీలేరు: జికె. వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో మూడు రోజుల నుంచి చలి తీవ్రత అధికమైంది. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి, చలితీవ్రత పెరిగింది. శీతాకాలంలో మాదిరిగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో మన్యవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నెలరోజుల క్రితం నాటి పరిస్థితులను తలపించేలా చలి వణికిస్తోందని స్థానికులు అంటున్నారు. రథసప్తమి అనంతరం పగటిపూట ఎండలు తీవ్రత అధికంగా ఉంటూ చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. సంక్రాంతి ముందునాటి చలి తీవ్రత పరిస్థితులు కనిపిస్తుండడంతో అప్పటిమాదిరిగానే చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందాల్సిన పరిస్థితులున్నాయని స్థానికులు సీలేరు నది పరివాహక ప్రాంతంలో ఉన్న చింతపల్లి క్యాంపు, లైక్ లైకన్‌పూర్, చంద్రపల్లి తదితర ప్రాంతాల్లోని తీవ్రమైన చలితో ఇబ్బందులుపడుతూ చలిమంటలతో ఉపశమనం పొందుతున్నారు. మహాశివరాత్రి వరకు వాతావరణం ఇలాగే ఉంటుందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అలాగే దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు తదితర ప్రాంతాల్లోనూ స్వల్పంగా మంచు కురుస్తూ చలి తీవ్రత మరింత అధికమైంది. ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంత గిరిజనులు కూడా చలి తీవ్రతను తట్టుకోలేక ఇబ్బందులకు గురౌతున్నారు.



అవగాహన కల్పిస్తున్న హీరో శ్రీకాంత్

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి

- హీరో శ్రీకాంత్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అల్లూరి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు మీకోసం మీ పోలీస్ అనే కార్యక్రమంలో భాగంగా అరకు సిఐ జీడి బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని మాడగడ పంచాయతీ గంగుడి గ్రామంలో మీ కోసం మీ పోలీస్ అనే కార్యక్రమంలో సినీ నటుడు హీరో శ్రీకాంత్, హీరో రాహుల్, హీరోయిన్ శ్రీవాణి ఆదివారం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ, మూఢ నమ్మకాలతో గిరిజనులు ప్రాణాలు పోగొటుకుంటున్నారన్నారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, నాటు సారా విక్రయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో మొండిచేయి చూపినా ప్రశ్నించరేం?

సిఎం జగన్, ఎంపీలు, రాష్ట్ర ప్రభుత్వం తీరుపై నిరసన

సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతుల దగ్ధం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతూ, కార్పొరేట్లకు వరాలు కురిపించేలా ఉందని సిపిఎం, ప్రజాసంఘాల నేతలు మండిపడ్డారు. ఆదివారం సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాజవొమ్మంగిలో నిరసన చేపట్టారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యవర్గసభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతానికి, అలాగే 40 కోట్ల మంది కార్మిక వర్గానికి కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కనీస వేతనాల అమలు, నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ, నూతన ఉపాధి కల్పన, మూసేసిన పరిశ్రమలను తెరిపించడం, మహిళలకు రక్షణ, ఏజన్సీ ప్రాంత అభివృద్ధి వంటి విషయాల ప్రస్తావనగానీ, వాటికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుంటే దేశం ఎలా అభివృద్ధి చెందుతుందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు, అంకెల గారడితో మధ్య తరగతి ఉద్యోగులకు మభ్యపెట్టారన్నారు. పేదలకందించే ఆహార సబ్సిడీలపై కోత విధిస్తూ ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం, ఉపాధి హామీ పథకాలకు బడ్జెట్లో నిధులు తగ్గించారని మండిపడ్డారు. ప్రజల కొనుగోలు శక్తిని మరింత హరించేలా బడ్జెట్‌లో కేటాయింపులు ఉండడం దుర్మార్గమని విమర్శించారు,

బడ్జెట్‌లో కార్పొరేట్లకు వరాలు కురిపిస్తూ, ప్రజల ఆస్థులైన ప్రభుత్వ రంగసంస్థలను కారు చౌకగా వారికి కట్టబెట్టేందుకు సిద్ధపడుతున్నారని విమర్శించారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా, ముంపు మండలాల ప్రజలకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరొకసారి కేంద్రం అన్యాయం చేసిందన్నారు.

కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతుంటే అత్యధిక లోక్‌సభ, రాజ్యసభ సభ్యులున్న అధికార వైసిపిగానీ, సిఎం జగన్మోహనరెడ్డి కనీసం స్పందించక పోవడం, రాష్ట్ర ప్రజల అవసరాలను ప్రస్తావన చేయకపోవడం దురదష్టకరమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలన్నీ తక్షణమే బడ్జెట్‌లో పునర్వ్యవస్థీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు,. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కొండ్ల సూరిబాబు, కె. జగన్నాధం, మేలిన రమేష్, జర్తా రాజు, పి లోవరాజు, లోతా అర్జున్, జర్తా అబ్బాయి పాల్గొన్నారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నేతలు

200 మందికి వైద్య పరీక్షలు



వైద్యశిబిరంలో సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - రంపచోడవరం : రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో ఆదివారం వైద్య శిభిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి వినిష్చలానంద మహారాజ్ తెలిపారు. శిభిరంలో సుమారు రెండు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 74మందికి రక్తపరీక్షలు, ఎనిమిదేసి మందికి థైరాయిడ్ నిర్ధారణ, ఎక్స్‌రే పరీక్షలు, ఎనిమిది మందికి ఫిజియోథెరపీ, ఒకరికి ఇసిజి పరీక్షలు చేసినట్లు స్వామీజీ తెలిపారు. వైద్య శిబిరంలో తలారి వెంకట సుబ్బారావు, జి.భాస్కర్, రాయుడు శ్రీనివాస్, సంపత్ కుమార్, రామకృష్ణ మిషన్ రాజమండ్రి కమిటీ సభ్యులు ఎన్.దుర్గాప్రసాద్, రామకృష్ణ మిషన్ సేవా సమితి, అనపర్తి సభ్యులు రామిరెడ్డి, శ్వేతా, క్యాంప్ కోఆర్డినేటర్ కానుమొను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన రోగులకు వారి సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

సమస్యలు పరిష్కరించాలని..

నేడు అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి-పాడేరు: తమ సమస్యల్ని పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని పాడేరు డివిజన్ 11 మండలాల పరిధిలో ఉన్న అంగన్వాడి వర్కర్లు అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద ఈనెల6న సోమవారం మహాధర్నా నిర్వహిస్తున్నారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు అల్లూరి జిల్లా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు దురియా నాగమ్మ, కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు హాజరవుతారని, ఏజెన్సీలోని 11 ఐసిడిఎస్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల వర్కర్లు ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. అంగన్వాడి వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26,000 చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. అంగన్వాడి వర్కర్లకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా నిర్వహిస్తున్నారు.

ధర్నాకు మహిళా సంఘం మద్దతు

అంగన్వాడీ వర్కర్లు సోమవారం నిర్వహిస్తున్న ధర్నాకు గిరిజన మహిళా సంఘం తరపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కౌసల్య, ఎస్.హైమావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అంగన్వాడీ వర్కర్ల న్యాయమైన దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కనీస వేతనం 26 వేలతో పాటు మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా మార్చాలన్నారు. అంగన్వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సైబర్ నేరాలు, మోసాలపై అవగాహన



వారపుసంతలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -కొయ్యూరు: సైబర్ నేరాలు, మోసాలపై ఆదివారం కొయ్యూరు వారపు సంతకు వచ్చే గిరిజనులకు కొయ్యూరు సిఐ స్వామి నాయుడు, మంప ఎస్ఐ లోకేష్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించి, చైతన్య పరిచారు. కొయ్యూరు, కాకరపాడు, బాలరేవుల, మంప, బూదరాళ్ల, పరిసర ప్రాంతాల నుంచి వారపుసంతకు వచ్చే ప్రజలకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురికాకుండా ఉండాలంటే ఏంచేయాలో, మోసానికి గురైతే చేపట్టాలని చర్యలపై విపులంగా వివరించారు. అదేసమయంలో ప్రజలంతా నాటుసారా, గంజాయి వంటి నిషేధిత వస్తువులకు దూరంగా ఉండాలని, గంజాయి, నాటుసారా తరలించినా, అమ్మినా, తీసుకున్నా చట్టపరంగా కలిగే అనర్థాలు, కేసులు గురించి వివరించి, ప్రజలు ముఖ్యంగాయువత, విద్యార్థులు దానికి దూరంగా ఉండాలని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యాపథకాలను సద్వినియోగం చేసుకుని, పిల్లలను బాగా చదివించాలని, వారి ప్రయోజకులైతే కుటుంబ ఆర్థిక పరిస్థితి, సామాజిక స్థితి ఎంతో మెరుగవుతుందని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గిరిజన యువతకు ఎస్ఐ, కానిస్టేబుల్‌తోపాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన కల్పించారు.

నదిలో పడి యువతి మృతి

ప్రజాశక్తి -చింతూరు. : మండలంలోని నిమ్మలగూడెం గ్రామానికి చెందిన సవలం ప్రత్యూష(30) అనే యువతి శనివారం ఉదయం బట్టలు ఉతికేందుకు శబరి నదికి వెళ్ళింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడి మునిగిపోయింది. బట్టలు ఉతికేందుకు ఉదయం వెళ్లిన యువతి మధ్యాహ్నం వరకు తిరిగి రాకపోవడంపై కుటుంబ సభ్యులు ఆందోళనతో శబరి నదికి వెళ్లి పరిశీలించారు. ఉతికిన బట్టలు ఒడ్డుపైనే ఉండడంతో, యువతి కోసం గాలించారు. ఆచూకీ కనిపించకపోవడంతో నదిలో మునిగిపోయిందని నిర్ధారించుకున్నారు. విషయం తెలుసుకున్న నిమ్మలగూడెం గ్రామస్తులు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం సాయంత్రం ప్రత్యూష మతదేహం తేలియాడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చింతూరు ఎస్ఐ యాదగిరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు



ప్రత్యూష మృతదేహం

వారపుసంతలో విస్తృత తనిఖీలు



గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దారకొండ వారపు సంతలో సిఆర్‌పిఎఫ్ 42వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు లక్ష్యంగా ప్రత్యేక నిఘా పెట్టి సోదాలు చేశారు. అపరిచిత, కొత్త వ్యక్తులను వారి గుర్తింపు కార్డుల ఆధారంగా నిర్ధారించుకున్నాక విడిచిపెట్టారు. సంతకు వచ్చే వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజన యువతతో మమేకమయ్యారు.

ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యను అలవర్చుకోవాలని సూచించారు. బడిఈడు పిల్లల్ని చదువుకు దూరంగా ఉంటే, వారికి తిరిగి పాఠశాలకు పంపే బాధ్యతను యువత తీసుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు, అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించవద్దని సూచించారు. ప్రభుత్వం, పోలీసులు అందిస్తున్న సహకారాన్ని గిరిజనం, ముఖ్యంగా యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు, వాహనాలను నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



రగ్గులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ మనోజ్ కుమార్

మహిళలకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-పెదబయలు:మండలంలోని సీకరీ పంచాయతీ బొడ్డపుట్టు, పన్నేడ గ్రామాల్లో 198 బెటాలియన్ సిఆర్‌పిఎఫ్ డిఎస్‌పి చియన్ రాజ్, స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్‌ల ఆర్థిక సహాయం తో నిరుపేదలకు రగ్గులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుల్లెలు కృష్ణారావు, ఎంపీటీసీ వి.ఆనందరావు, వైసిపి మండల కన్వీనర్ కొర్ర కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సుభాష్ చంద్ర బోస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ పాఠశాలలో 1996-97 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు రామ్ మోహన్ మాస్టారు చేతుల మీదుగా విగ్రహ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుక్కర శ్రీధర్, ఎడ్ల హేమంత్, పుట్టా సేదుట్, సతీష్, భమిడిపాటి గిరి, పొలిమేర లక్ష్మణరావు ఆధ్వర్యం వహించారు,

పేదలకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోటలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం రెండవ రోజుకు చేరుకుంది. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో స్థానిక ఒకటవ సచివాలయం పరిధిలో రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామంలో మూడు, నాలుగు వార్డులలో ఎమ్మెల్యే పర్యటన సాగింది. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు పై అరా తీశారు. అర్హత కలిగిన పేదలకు పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తనకు రేషన్ కార్డు తో పాటు సామాజిక పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోసిరెడ్డి రాజబాబు కోరగా, తమకు సామాజిక భవన నిర్మాణానికి నిధులు మంజూరు కు కృషి చేయాలనీ స్థానిక నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పార్టీలకు, మతాలకు తావు లేకుండా ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరెక్టర్ జి.సత్యదేవ్, గ్రామ సర్పంచ్ కొన లోవరాజు, ఉపసర్పంచ్ పి.దేవ, ఎం పిటిసి సభ్యులు కె.లక్ష్మి శంకర్, పూడి దేవ, మాజీ ఉపసర్పంచ్ కె.గున్నాజీ, వైసీపీ జిల్లా కార్యదర్శి తలారి ఆదిమూర్తి, శీలం శంకరరావు పాల్గొన్నారు...

కాలువల్లో పూడికతీత పనులు

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:మున్సిపాలిటీ 9వ వార్డు జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య వార్డు పరిధిలోని కాలువల్లో పేరుకు పోయిన చెత్త, పూడికను తన సొంత నిధులు వెచ్చించి ఆదివారం తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 9వ వార్డులో మూడు నెలలుగా చెత్త, కాలువల్లో పూడికలు పేరుకు పోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదన్నారు. మూడు నెలలుగా జేసిబి మరమ్మతు చేయించలేని పరిస్థితిలో నర్సీపట్నం మున్సిపాలిటీ ఉందన్నారు. కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని కౌన్సిల్ సమావేశంలో చైర్ పర్సన్ దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేక పోవడంతో తమ సొంత నిధులు వెచ్చించి కాలువలను శుభ్రం చేయించామన్నారు. ఆమె వెంట నర్సీపట్నం జనసేన టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ ఉన్నారు.

గ్రంథాలయాల్లో పుస్తక పఠనం

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్స్ క్లబ్‌లో భాగంగా బుక్ రీడింగ్, నీతి కథలు చెప్పడం వంటి కార్యక్రమాలను గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

17న చలో ఐటిడిఏను విజయవంతం చేయాలి

గిరిజన కాఫీ రైతుల సంఘం
సుంకరమెట్ట వారపు సంతలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:

కాఫీ రైతులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న చేపట్టే చలో ఐటిడిఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన కాఫీ రైతుల సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని సుంకరమెట్ట వారపు సంతలో కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన కాఫీ రైతుల సంఘం నాయకులు మాట్లడుతూ, అల్లూరి జిల్లా పాడేరు 11 ఏజెన్సీ వ్యాప్తంగా కాఫీ రైతులకు రూ.60 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న ఆర్గానిక్ కాఫీకి గిట్టుబాటు ధరలు కల్పించి, కాఫీ తోటలకు పట్టాలు ఇవ్వాలన్నారు. గతంలో దరఖాస్తు వాటికి నేటికీ పూర్తి స్థాయిలో పట్టాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మండలాల్లో గిడ్డంగుల కేంద్రాలు నిర్మాణం చేయాలన్నారు. డిపో పరిధిలో ఐటిడిఏ ఆధ్వర్యాన కాఫీ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాఫీ రైతులకు బ్యాంకు రుణ సదుపాయం కల్పించి, తోటల అభివృద్ధికి తోడ్పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తోటలు నష్టపోతే నష్టపరిహారం చెల్లించాల న్నారు. కాఫీ బేబీ పల్పర్, నిచ్చెనలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ మండల కార్యదర్శి పి.రామన్న, మండల అధ్యక్షులు జి.బుజ్జిబాబు, నాయకులు కె రామరావు, కాఫీ రైతుల మండల నాయకులు పి.నానిబాబు, కె.బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.



సుంకరమెట్ట వారపు సంతలో ప్రచారం చేస్తున్న నాయకులు

అంజోడలో పాల డబ్బాల పంపిణీ



పాల డబ్బాలు పంపిణీ చేస్తున్న కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:డుంబ్రిగుడ మండలం కోరాయి పంచాయతీ పెద్ద అంజోడ గ్రామానికి చెందిన సమర్థి భూమిక (18) బిడ్డకు జన్మనిచ్చి బాలింత మృతి చెందింది. దీంతో శ్రీనివాస్ మెడికల్ స్టోర్ గుప్తా ఆర్థిక సహాయం సుమారు వెయ్యి రూపాయలు ఖరీదైన పాల డబ్బాలు ఉచితంగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె,సురేంద్ర మాట్లడుతూ, తల్లీ పాలకు దూరమైన బాబుకు ప్రతీ నెలా అంగన్వాడి కేంద్రంలో ఉచితంగా పాల డబ్బాలు పంపిణీ చేయాలని చెప్పారు. ఏజెన్సీలో పౌష్టికాహారం అందక చాలా మంది బాధపడుతున్నారన్నారు. ఆర్థిక సహాయం అందించిన శ్రీనివాస్ మెడికల్ షాపు గుప్తకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తీరం.. జనసంద్రం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని బోయపాడు, దొండవాక సముద్ర తీరాల్లో జనసందోహం కనిపించింది. ఆదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సముద్ర తీరాల్లో స్నానాలు ఆచరించారు. పలు ప్రాంతాల నుండి జనం తరలి రావడంతో సముద్ర తీరం జనం రద్దీతో కిటకిటలాడింది. మాఘ పౌర్ణమి సందర్భంగా సముద్ర తీరాల్లో చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని, వ్యాపారాలు సాగించారు.

పాయకరావుపేట:మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని పెంటకోట తీర ప్రాంతంలో అధిక సంఖ్యలోని భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా చిక్కాల యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేపట్టారు.

నర్సీపట్నం టౌన్ :మాఘ పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం లో అన్న సమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వాసవి క్లబ్ పిఎస్‌టిలు సుతాపల్లి శ్రావణ్, చైతన్య, వినాయక రామకృష్ణ ఆధ్వర్యాన నిర్వహించారు. సుమారు 50 మందికి

ఘనంగా మాఘ పౌర్ణమి వేడుకలు

దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, పుట్టిన, పెళ్లి రోజుల సమయంలో దాతలు ముందుగా ఆలయ కమిటీకి తెలియజేస్తే అన్నదానానికి సమకూరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దేవత కామేష్, జాలుమూరి జోగారావు తదితరులు పాల్గొన్నారు

ఎస్.రాయవరం: మండలంలోని తీరప్రాంత గ్రామమైన రేవుపోలవరంకు భక్తులు పోటెత్తారు. నక్కపల్లి, యలమంచిలి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల నుండే కాక ఏజెన్సీ ప్రాంతాల నుండి భక్తులు పుణ్యాస్నానాలు ఆచరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నక్కపల్లి సిఐ నారాయణరావు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రయాణీకుల సౌకర్యార్థం నర్సీపట్నం ఆర్టీసి అధికారులు బస్సులను ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు సేవాకార్యక్రమాలు చేపట్టాయి.

నేరాలు ఘోరాలు

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని విప్పలపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నామని కేడిపేట ఎస్సై సూర్యనారాయణ తెలిపారు. గ్రామానికి చెందిన కూసరపు జోగారావు మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకొని 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పాతకేడిపేట శివారులో అదే గ్రామానికి చెందిన విజయకుమారి సారా విక్రయిస్తుండగా దాడి చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ రెండు కేసుల్లో నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం గ్రామ శివారులోని టౌన్ సిఐ నమ్మి గణేష్ ఆధ్వర్యంలో సుమారు 1500 లీటర్ల సారా బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ గణేష్ మాట్లాడుతూ, నాటు సారా అమ్మే వారిని వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. సారా తయారీ, రవాణా చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

54 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి పాయకరావుపేట: మండలంలోని పిఎల్ పురం జంక్షన్ వద్ద ఎస్సై జోగారావు తన సిబ్బంది సహాయంతో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా నామవరం నుండి తుని వెళ్తున్న అశోక్ లేలాండ్ గూడ్స్‌లో తరలిస్తున్న 54 కేజీల గంజాయితో ఇద్దరు పట్టుబడినట్లు తెలిపారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు

పట్టుబడ్డ సెల్ దొంగ

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార రైతుబజార్‌లో మొబైల్ దొంగతనం చేసిన వ్యక్తిని రైతుల పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు మాట్లాడుతూ, గత కొన్ని రోజుల నుంచి రైతు బజార్‌లో చోరీలు జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై రైతులు ప్లాన్ ప్రకారం చోరీలు చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులను అభినందించారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ కుప్పిలి రాజు నర్సీపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో 70 నుంచి 80 సీట్లలో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీ బలోపేతానికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ కుటుంబ సభ్యులు కృషి చేయాలని అన్నారు. జిల్లాల వారీగా పర్యటన చేసి పూర్వవైభవానికి కృషి చేస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ పరిస్థితులపై చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు మీసాల సుబ్బన్న, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి పాయకరావుపేట:ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.ఆర్.ఎన్ వర్మ కోరారు. స్థానిక పాండురంగ కళ్యాణ మండపం వద్ద యూజెఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత చెంగల వెంకట్రావు, మాజీ గ్రంథాలయ చైర్మన్ తోట నగేష్, జడ్పిటిసి సభ్యులు లంక సూరిబాబు మాట్లాడుతూ, పాత్రికేయులు సేవా పనులు చేపట్టడం అభినందనీయమన్నారు.యూజెఎఫ్ సేవలను ప్రశంసించారు.

ఈ వైద్య శిబిరంలో సుమారు 100 మందికి పరీక్షలు చేసి, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి కళ్యాణి లక్ష్మణరావు, వైద్యులు పాల్ కిరణ్, స్వరాజ్యం, ప్రసాద్, యు.జె.ఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ బీసీ నాయకులు కేసన్ కుర్తి సత్తిబాబు, కార్యదర్శి మల్లేశ్వరరావు, కార్యనిర్వాహకులు తుమ్మలపల్లి కుమార్, వెంకట్, వెంకటేష్, గణేష్ పాల్గొన్నారు.

మణికంఠ స్వామికి సత్కారం


ప్రజాశక్తి పాయకరావుపేట:వైస్ ఎంపీపీ 2 ఎన్నికైన పల్లెల మణికంఠ స్వామినీ మాజీ ఎమ్మెల్యే వైసీపీ నేత చెంగల వెంకట్రావు అభినందించారు.



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మావతి

ఐద్వా గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - చింతూరు : మండలంలోని లక్కవరం గ్రామంలో ఆదివారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా సాదుల లలిత. దుప్పటి పార్వతితోసహా 15మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ పద్మావతి, జిల్లా కమిటీ సభ్యులు ముర్రం రంగమ్మ మాట్లాడుతూ లక్కవరం గ్రామంలో తాగునీరు, వీధిదీపాలు విద్యుత్ స్తంభాలు, మరుగుదొడ్లువంటి సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పనలో అధికారులు, పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారని విమర్శించారు. . గిరిజనులకు ప్రధానంగా రహదారులు, విద్యుత్తు రవాణా వ్యవస్థ సరిగా లేదని, వాటి కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించకుండా, వాటిని సక్రమంగా వినియోగించి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మన్యంలో సమస్యలపై నిర్లక్ష్యం వీడకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు రుక్మిణి, ముత్తమ్మ, విజయ, సంగీత, సునీత పాల్గొన్నారు.



సూర్యాస్తమయ సమయాన కనువిందు చేస్తున్న సీలేరు

అరుణారుణ సూర్యాస్తమయం

ప్రజాశక్తి - సీలేరు: సీలేరు మార్కెట్ వైపు ఆదివారం సూర్యాస్తమయం సమయంలో అపురూప దశ్యం ఆవిష్కృతమైంది. సాయంత్రం 6.15 గంటల సమయంలో ఎరుపు కాషార రంగుల్లో కాంతులీనుతూ దర్శనమిచ్చిన భానుడిని చూసి స్థానిక ప్రజలు ప్రత్యేక అనుభూతిని పొందారు. ఈ దశ్యాన్ని ఎపి జెన్‌కో కాంట్రాక్టు లేబర్ బి.లక్ష్మణ్ తన సెల్‌ఫోన్‌లో బంధించారు.

'పాప్ కార్న్' చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) : ఆచార్య క్రియేషన్స్ బ్యానర్‌పై సాయి, అవిక గౌర్ హీరో, హీరోయిన్లుగా భోగేంద్ర గుప్తా నిర్మాణంలో మురళీ గంధం దర్శకత్వం వహించిన పాప్‌కార్న్ మూవీ ఈ నెల 10న విడుదల కానుందని చిత్ర యూనిట్ తెలిపింది. ఆదివారం సాయంత్రం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దర్శకులు మురళీ గంధం మాట్లాడుతూ ఒక డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ మూవీని తీశామన్నారు. ఆడియన్స్‌కి ఈ చిత్రం ఒక కొత్త అనుభూతినిస్తుందన్నారు. సినిమా చాలా వరకూ లిఫ్టులో కొనసాగుతుందని అన్నారు. హీరో, హీరోయిన్లు 18 గంటలపాటు ఒక లిఫ్టులో ఇరుక్కుపోతారని, ఆ క్రమంలో లిఫ్ట్‌లో వారిద్దరి మధ్య జరిగిన సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయని వెల్లడించారు. హీరో సాయి మాట్లాడుతూ ప్రెజర్ కుక్కర్, రాజహంస వంటి పలు చిత్రాలలో హీరోగా చేసానని తెలిపారు.

ముందుకుసాగని జగనన్న ఇళ్లు

53 రోజుల్లో 48,417 గృహాల నిర్మాణం పూర్తయ్యేనా..
నిర్దేశిత లక్ష్యాన్ని గృహ నిర్మాణ సంస్థ చేరుకునేనా..



పరవాడలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో జగనన్న ఇళ్లు ముందుకు సాగడం లేదు. గృహ నిర్మాణ లక్ష్యం చేరుకోవడానికి 53 రోజులు వున్నాయి. ఈ గడువులోగా 48,417 ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి. రోజుకు 913 ఇళ్లు చొప్పున పూర్తయితేగానీ మార్చి నాటికి గృహ నిర్మాణ లక్ష్యం చేరుకోవడం సాధ్యంకాదు. జిల్లాలోని 24 మండలాలు, అనకాపల్లి పట్టణ కేంద్రం, యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాల్టీలకు 53,567 ఇళ్లు మంజూరయ్యాయి. ఈ ఇళ్ల నిర్మాణాలను 2023 మార్చి నాటికి పూర్తిచేయాలని గృహ నిర్మాణ సంస్థకు ప్రభుత్వం లక్ష్యం విధించింది. లక్ష్యం ఘనంగా వున్నా, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న 1.80 లక్షలు పునాదులకు దాటి రాకపోవడంతో అదనంగా డబ్బు పెట్టి ఇళ్లు నిర్మించుకోలేని పేదలు ఆసక్తి చూపడంలేదు. జిల్లాలోని చోడవరం, మాడుగుల, అనకాపల్లి, పెందుర్తి, పాయకరావుపేట, యలమంచిలి, నర్సీపట్నం నియోజకవర్గాల్లోని 787 లే అవుట్లు , సొంత స్థలాల్లో కలిపి 53,567 ఇళ్లను ప్రభుత్వం కొన్ని నెలల క్రితం మంజూరుచేసింది. వీటిలో 5150 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 1691 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. బిబిఎల్ స్థాయిలో 30,602, బిఎల్ దశలో 9894, రూఫ్ లెవల్‌లో 2681, స్లాబ్‌లు పూర్తయినవి 3549 వున్నాయి.

ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - పరవాడ: జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ప్రతి ఇంటికీ ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. పరవాడలోని జగనన్న గృహ నిర్మాణాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జగనన్న గృహాలకు ప్రభుత్వం ఇస్తున్న బడ్జెట్‌ను పెంచాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులు నిర్మాణాలకు సరిపోక పలువురు అప్పులు చేస్తున్నారని తెలిపారు. ఇనుము, రాయి, ఇటుకలు తదితర ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం నిర్మితమవుతున్న గృహాలకు వెంటనే బిల్లులు విడుదల చేయాలన్నారు. కాలనీల్లో రోడ్లు, కాలువలు, వీటి దీపాలు వంటి అన్ని సౌకర్యాలూ ఉండాలని కోరారు. ఆయన వెంట సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఉన్నారు.

ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు, పూర్తయిన నిర్మాణాలు మండలాల వారీగా

మండలం	ఇళ్లు మంజూరు	పూర్తయినవి
అనకాపల్లి అర్బన్	3621	139
అనకాపల్లి రూరల్	3096	128
అచ్యుతాపురం	1517	204
బుచ్చెయ్యపేట	2244	103
చీడికాడ	1807	56
చోడవరం	2790	164
దేవరాపల్లి	1891	59
యలమంచిలి	996	116
యలమంచిలి అర్బన్	1636	364
గొలుగొండ	1751	82
కె.కోటపాడు	2084	87
కశింకోట	2144	379
కోటవురట్ల	1350	115
మాడుగుల	2530	117
మాకవరపాలెం	1225	85
మునగపాక	1001	160
నక్కపల్లి	2608	217
నర్సీపట్నం	1076	64
నర్సీపట్నం అర్బన్	2890	440
నాతవరం	2029	122
పరవాడ	957	309
పాయకరావుపేట	2976	361
రాంబిల్లి	1247	241
రావికమతం	2053	152
రోలుగుంట	1846	128
ఎస్.రాయవరం	2122	306
సబ్బవరం	2080	452

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలం లోని జడ్డంగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైకుంఠపురం, బోర్నగూడెం సమీప అటవీ ప్రాంతంలో నాటుసారా ఈ సందర్భంగా సారా తయారికి ఉపయోగించే 1600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది ప్రసాద్‌రెడ్డి, దుర్గారావు, ఎపిఎస్‌సి బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.



సారా బట్టీలపై దాడి చేసిన పోలీసులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కె.శ్రీనివాస్ తదితరులు

స్వాతంత్ర్య స్ఫూర్తిని భావితరాలకు అందించాలి
- సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - సీతమ్మధార : నేడు స్వాతంత్ర్యోద్యమ చరిత్రను మరిచిపోతున్నామని, అలా కాకుండా ఆ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్ అన్నారు. రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన స్వరాజ్య స్ఫూర్తి @ 75 పుస్తకావిష్కరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం సంకలనకర్త రామినాయుడును అభినందిస్తూ తొలి ప్రతిని గరిమెళ్ళ మనవడు అశోక్ లక్ష్మణకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ ఉద్యమ చరిత్రలో పోరాటం ఉందని, అలా పోరాటం చేసిన వారు నవ స్వాతంత్ర్య భారతంలో గుర్తింపు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన ఐదేళ్ల తర్వాత గరిమెళ్ళ సత్యనారాయణ, కొండ వెంకటరావు వంటి వారిని గుర్తించలేదని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ చనిపోయారని తెలిపారు. జిడిపి పెరిగిందని గొప్పగా చెప్పుకుంటున్నారని, నాటి విలువలు పెరిగాయా ? అన్నది అందరూ సమీక్షించుకోవాలని అన్నారు. అనేక గొప్ప ఆదర్శాలు జాతీయ ఉద్యమంలో ఉన్నాయని, వాటిని గుర్తించకుండా దండయాత్ర వల్ల దేశం నాశనం అయిపోయిందని ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రస్తుత మత తీవ్రవాద శక్తుల వల్ల గాంధీయవాదులు ఒకవైపు నిలబడుతున్నారని తెలిపారు. ఇటువంటి తరుణంలో స్వరాజ్య స్ఫూర్తి @ 75 వంటి సంకలన పుస్తకం ఎంతో అవసరమన్నారు. పుస్తక సంకలనకర్త రామినాయుడు మాట్లాడుతూ ఇప్పటి తరానికి నాటి మహనీయులు స్వాతంత్ర్య ఉద్యమంలో పడిన కష్టాలను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ రచయిత డాక్టర్ డివి.సూర్యారావు పుస్తక సమీక్ష చేస్తూ 75 ఏళ్ల స్వాతంత్ర్య ఉద్యమంలో మంచి చెడులను రచయితలు వ్యాసాలలో విశ్లేషించారన్నారు. పుస్తకంలో మొదట, చివరి వ్యాసాలు గరిమెళ్ళ సత్యనారాయణను ప్రస్తావిస్తూ ఉన్నాయని, తిరుమలరావు రాసిన 'విస్మరించిన గరిమెళ్ల' ఆలోచింపజేసే విధంగా ఉందని అన్నారు. నేడు సాంకేతికతకు ప్రాధాన్యతనిస్తూ సినిమాలు వస్తున్నాయని, సామాజిక చిత్రాలు రావడం లేదని తెలిపారు. రచయిత శ్రీనివాసరావు నాటి గాంధీయవాదం తర్వాత నెహ్రూ వాదం, 2014 నాటి మోడీ విధానం, ప్రస్తుత పరిస్థితిని పుస్తకంలో సమీక్షించారన్నారు. స్వాతంత్రోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర గురించి తెలకపల్లి రవి చక్కగా వివరించారన్నారు. గరిమెళ్ళ మనవడు అశోక లక్ష్మణ మాట్లాడుతూ తండ్రి సత్యనారాయణకు నలుగురు కుమార్తెలని, మూడో కుమార్తె వెంకటరత్నం కుమారుడను తానని అన్నారు. తాత సత్యనారాయణ చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు భరించారని, అతని మృతదేహానికి అద్దేపల్లి రామారావు దహన సంస్కారాలు చేశారని తెలిపారు. రైటర్స్ అకాడమీ అధినేత వివి.రమణమూర్తి మాట్లాడుతూ రెండేళ్లు శ్రమించి రామినాయుడు ఈ పుస్తకాన్ని రూపొందించారన్నారు. మొత్తం 21 మంది రచయితలు వ్యాసాలు అందించారని, 75 ఏళ్ల నాటి స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి ఈ సంకలనం ద్వారా వెలుగులోకి రావడం ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం అతిథులు కె.శ్రీనివాస్, రామినాయుడు, సూర్యారావు, అశోక్ లక్ష్మణలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సదస్సులో పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డి.వర్మ, ప్రముఖులు సీతామాలక్ష్మి, రమాకాంత్, రామాంజనేయులు, జ్యోతి, తిలక్, వర్మ, వేణు మాస్టారు, ఫణిశయన సూరి, సాహిత్య ప్రియులు పాల్గొన్నారు.

నేవీ ఉద్యోగుల హెల్త్ వాక్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించడానికి నేవీ ఉద్యోగులకు ఆదివారం హెల్త్ వాక్ కార్యక్రమం చేపట్టారు. సుమారు 150 మంది నావికా సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ హెల్త్ వాక్ డాల్ఫిన్ స్పోర్ట్స్ గ్రౌండ్ నుంచి ఐఎన్ఎస్ వీరబాహు వరకూ ఆరు కిలోమీటర్ల మేర సాగింది.